ఎన్నికల బాండ్లు
రాజ్యాంగ విరుద్ధం

స్కీమ్ అమలు సమాచార హక్కు ఉల్లంఘనే

- క్విడ్ ప్రోకోకు దారితీసే ప్రమాదమూ ఉన్నది
- నల్లధనాన్ని అరికట్టేందుకు ఇది మార్గం కాదు
- ఎస్బీఐ వెంటనే బాండ్ల జారీని నిలిపేయాలి
- ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఎన్నికల బాండ్లపై తీర్పు ఇస్తున్న సీజేఐ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు ఆరేండ్ల కిందట కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల (ఎన్నికల బాండ్లు) చెల్లుబాటుపై సుప్రీంకోర్టు గురువారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని తేల్చి చెప్పింది. విరాళాలు ఇచ్చిన వారి వివరాలను రహస్యంగా ఉంచడం సమాచార హక్కును కాలరాయడమేనని స్పష్టం చేసింది. ఎన్నికల బాండ్ల జారీని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) వెంటనే నిలిపివేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవ తీర్పునిచ్చింది.

అత్యున్నత ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

- రాజకీయ పార్టీలకు ఎక్కడి నుంచి నిధులు వస్తున్నాయో తెలియడం పారదర్శక ఎన్నికల్లో ప్రధానమైనది. అయితే, ఎటువంటి వివరాలు తెలియకుండా ఎన్నికల బాండ్లను స్వీకరించడమనేది సమాచార హక్కును ఉల్లంఘించడమే అవుతుంది.
- విరాళాలు ఇచ్చిన వారి వివరాలు రహస్యంగా ఉంచడం తగదు. ఇది సమాచార హక్కు, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే.
- ప్రాథమిక హక్కుల అధికరణం 19(1)(ఎ)ను అనుసరించి.. ఎలక్టోరల్ బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమైనది.
- నల్లధనాన్ని అరికట్టేందుకు ఈ స్కీమ్ ఒక్కటే మార్గం కాదు. ఆ కారణంతో సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించడం సమంజసం కాదు.
- బాండ్లను కొనుగోలు చేసి తద్వారా విరాళాలు ఇచ్చిన వారి/సంస్థల పేర్లను రహస్యంగా ఉంచడం అంటే ఆదాయపు పన్ను చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుంది.
- సంస్థల నుంచి అపరిమిత విరాళాలను అనుమతించేలా 'కంపెనీల చట్టం'లో సవరణలు చేశారు. ఇవి ఏకపక్షంగా, రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయి.
- బాండ్ల జారీ విధానంలో పారదర్శకత లోపించింది. కంపెనీలు రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాలు క్విడ్ ప్రోకోకు దారి తీసే ప్రమాదం కూడా ఉన్నది.
- ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చే విరాళాలను తప్పనిసరిగా బహిర్గతం చేయాలి.
- 2019 ఏప్రిల్ 12 నుంచి ఇప్పటివరకు రాజకీయ పార్టీలకు వచ్చిన ఎన్నికల బాండ్ల అన్ని వివరాలను (కొనుగోలు చేసినవారు, కొనుగోలు తేదీ, ఎంత మొత్తం కొనుగోలు చేశారు) మార్చి 6వ తేదీలోగా ఎస్బీఐ.. కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) సమర్పించాలి.
- మార్చి 13లోగా ఆ వివరాలను వెబ్సైట్లో ఈసీ ప్రచురించాలి.
- ఎలక్టోరల్ బాండ్ల రూపంలో తీసుకొని ఇంకా ఎన్క్యాష్ చేయని విరాళాలను (బాండ్లను) రాజకీయ పార్టీలు ఆయా దాతలకు వెంటనే వెనక్కి ఇచ్చేయ్యాలి.

తీర్పు ప్రజాస్వామ్యానికి గొప్ప వరం

రాజకీయ పార్టీల నిధుల కోసం తెచ్చిన ఎన్నికల బాండ్ల పథకంపై సుప్రీం కోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి గొప్ప వరం అని మాజీ ఎన్నికల ప్రధాన అధికారి ఎస్వై ఖురేషీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని ఇది పునరుద్ధరిస్తుందని చెప్పారు. గత ఐదు-ఏడు ఏండ్లలో సుప్రీంకోర్టు నుంచి వెలువడిన చారిత్రక తీర్పు అని ఆయన పేర్కొన్నారు. నిజంగా ఇది ప్రజాస్వామ్యానికి ఎంతో స్ఫూర్తినిస్తుందన్నారు. 'ఎన్నికల నిధుల విధాన ప్రక్షాళనకు మనం ఇంకా సుదూరంగా ఉన్నాం' అని మాజీ సీఈసీ ఎన్.గోపాల స్వామి తెలిపారు. సంచలన తీర్పు చెప్పిన సుప్రీంకు 'త్రీ చీర్స్' అని మరో మాజీ సీఈసీ సునీల్ ఆరోరా అన్నారు.

నోట్లపై ఓట్ల శక్తిని బలపరుస్తున్నది

సుప్రీం తీర్పుపై పలు రాజకీయ పార్టీలు హర్షం వ్యక్తం చేశాయి. పార్టీలకు నిధుల విధానంలో పారదర్శకత ఏర్పడుతుందని పేర్కొన్నాయి. ఈ చర్యపై ఇది నోట్లపై ఓట్ల శక్తిని బలపరుస్తుందని పీసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. ఈ పథకం అపారదర్శకం, అప్రజాస్వామికం అని కాంగ్రెస్ పేర్కొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఎన్నికల నిధుల విధానంలో స్వచ్ఛమైన, పారదర్శకమైన విధానాన్ని తేవాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎన్నికల నిధుల విధానంలో పారదర్శకత తేవడానికే దీనిని ప్రవేశపెట్టినట్టు సమర్థించుకున్న కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ సుప్రీం కోర్టు తీర్పును గౌరవిస్తున్నామని అన్నారు. ప్రధాని మోదీకి ప్రత్యామ్నాయం లేని స్థితిలో విపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి నళిని కోహ్లీ ఆరోపించారు.

ఏమిటీ ఎన్నికల బాండ్లు?



ఎలక్టోరల్ బాండ్లు ప్రామిసరీ నోట్ లాంటివి. భారత్కు చెందిన వ్యక్తులు లేదా కంపెనీలు తగిన రుసుము చెల్లించి వీటిని కొనుగోలు చేసి నచ్చిన రాజకీయ పార్టీలకు విరాళంగా ఇవ్వొచ్చు. పార్టీలు ఈ బాండ్లను నగదుగా మార్చుకోవచ్చు.

ఎప్పుడు తెచ్చారు? అభ్యంతరాలేమిటి?

2018, జనవరి 2న ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. రాజకీయ పార్టీల విరాళాల విషయంలో పారదర్శకత తీసుకురావాలనే లక్ష్యంతో దీన్ని తీసుకొచ్చినట్టు వెల్లడించింది. అయితే, రాజకీయ పార్టీలు తాము స్వీకరించిన విరాళాలను, వాటిని ఇచ్చిన దాతల వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదని పేర్కొంది. దీనికోసం ఆర్థిక చట్టం-2017 ద్వారా పలు సవరణలు చేసింది. దీంతో ఎలక్టోరల్ బాండ్ల విధానంలో పారదర్శకత లోపించిందని పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే ఈ పథకాన్ని సవాల్ చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), కాంగ్రెస్, సీపీఎం సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశాయి.

ఎప్పుడు జారీ చేస్తారు? రాజకీయ పార్టీలకు ఎలా చేరుతాయి?

కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ మొదటి 10 రోజులలో ఎలక్టోరల్ బాండ్లను ఎస్బీఐ జారీ చేస్తుంది. ఆ సమయంలోనే వీటిని కొనుగోలు చేయాలి. వెయ్యి రూపాయల నుంచి కోటి రూపాయల వరకు గుణిజాలలో ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చు. కేవైసీ ధృవీకరించిన ఖాతాదారులు మాత్రమే వీటిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఈ బాండ్లు కొనుగోలు చేసిన తేదీ నుంచి 15 రోజులలోపు దాతలు వీటిని తమకు నచ్చిన పార్టీకి అందించాల్సి ఉంటుంది. అలా వచ్చిన బాండ్లను రాజకీయ పార్టీలు.. ధృవీకరించబడిన ఖాతా ద్వారా మాత్రమే నగదుగా మార్చుకోగలవు. బాండ్లపై దాత పేరు ఉండదు. ఆ వివరాలు బ్యాంకు దగ్గర గోప్యంగా ఉంటాయి. ఇప్పటివరకూ ఎస్బీఐ 30 విడుతల్లో దాదాపు 28 వేల ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసింది.

ఏయే దేశాల్లో ఎలక్టోరల్ బాండ్లు?

ఎలక్టోరల్ బాండ్ల స్వీకరణ పద్ధతి యునైటెడ్ కింగ్డమ్ (యూకే), ఆస్ట్రేలియా, అమెరికా వంటి అగ్రదేశాల్లో కూడా ఉన్నది. అయితే, విరాళాలు సేకరించే రాజకీయ పార్టీలు.. దాతల పేర్లు, ఎంత మొత్తం అందుకొన్నారు? వంటి వివరాలను విధిగా తెలియజేయాల్సి ఉంటుంది. అలాగే, విరాళాలకు కూడా పరిమితి విధించారు.

'ఇండియా'కు ఫరూక్ షాక్!

జమ్ముకశ్మీర్లో ఒంటరిగానే పోటీ చేస్తామని ప్రకటన

శ్రీనగర్, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పాటైన ప్రతిపక్ష 'ఇండియా కూటమి'కి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. కూటమితో సంబంధం లేకుండా ఎన్నికల్లో పోటీ చేస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా తాజాగా ప్రకటించారు. గురువారం శ్రీనగర్లో మీడియాతో మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జమ్ముకశ్మీర్లో నేషనల్ కాన్ఫరెన్స్ ఒంటరిగా పోటీ చేస్తుందని ప్రకటించారు. ఏ పార్టీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. సొంతబలంపైనే ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కూటమితో కలవకుండా, ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయడానికి గల కారణాల్ని ఆయన వెల్లడించలేదు. అయితే వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమితోనే కొనసాగుతామని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పష్టంచేయడం గమనార్హం. వచ్చే లోక్సభ ఎన్నికల్లో జమ్ముకశ్మీర్లోని మొత్తం ఆరు సీట్లలో మూడింటిలో పోటీచేసేందుకు కాంగ్రెస్తో చర్చలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా, ఫరూక్ అబ్దుల్లాకు ఇటీవల ఈడీ నుంచి సమన్లు అందాయి. జమ్ముకశ్మీర్ క్రికెట్ అసోసియేషన్ ఆర్థిక లావాదేవీల్లో అక్రమాలు జరిగాయని ఈడీ ఆరోపిస్తున్నది.

టీఎంసీ నేత మొయిత్రాకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఇటీవల బహిష్కరణకు గురైన తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మహువా మొయిత్రాకు మరో షాక్ తగిలింది. ఫారెన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్మెంట్ యాక్ట్ (ఫెమా) నిబంధనలు ఉల్లంఘించారన్న ఆరోపణపై ఈడీ ఆమెకు గురువారం సమన్లు జారీ చేసింది. ఆమె స్టేట్మెంట్ను రికార్డు చేయడానికి ఈ నెల 19న ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశించింది. కాగా, మొయిత్రాపై వచ్చిన ఆరోపణలపై లోక్పాల్ సూచనల మేరకు సీబీఐ దర్యాప్తు జరుపుతున్నది. వ్యాపారవేత్త దర్శన్ హీరానందని నుంచి ముడుపులు తీసుకుని ప్రధాని మోదీ, అదానీ గ్రూప్లను లక్ష్యంగా చేసుకుని పార్లమెంట్లో ప్రశ్నలు అడిగినట్టు ఆరోపణలు రావడంపై మొయిత్రాపై దర్యాప్తు సంస్థలు విచారణ చేస్తున్నాయి.

ఎంపీ పదవికి నటి మిమీ చక్రవర్తి రాజీనామా

కోల్కతా, ఫిబ్రవరి 15: నటి, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మిమీ చక్రవర్తి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామాను బెంగాల్ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి సమర్పించారు. అయితే ఆమె రాజీనామాను మమత అంగీకరించ లేదు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ నేతలతో విభేదాల కారణంగానే తాను పదవికి రాజీనామా చేశానని మిమీ చెప్పారు. ఇంతకు రెండు రోజుల ముందే ఆమె పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పదవులకు రాజీనామా చేశారు. 'జాదవ్పూర్ అభివృద్ధికి నేను చాలా కలలు కన్నా. అయితే సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి రాజకీయాలకు పనికిరారంటూ నన్ను హేళన చేశారు. రాజకీయాల్లో నైతికత ఏంటన్నది నాకు అర్థం కావడం లేదు' అని ఆమె అన్నారు.

అజిత్ పవార్దే అసలైన ఎన్సీపీ

మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయం

ముంబై, ఫిబ్రవరి 15 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ వర్గమే అసలైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అని మహారాష్ట్ర శాసనసభ స్పీకర్ రాహుల్ నర్వేకర్ గురువారం ప్రకటించారు. ఎన్సీపీలోని 53 మంది ఎమ్మెల్యేలలో 41 మంది మద్దతు అజిత్ పవార్ గ్రూపునకు ఉందని పేర్కొన్నారు. అసలైన రాజకీయ పార్టీని నిర్ణయించడానికి ప్రామాణికం శాసనసభలో మెజారిటీ మాత్రమేనని చెప్పారు. అంతర్గత అసమ్మతి గళాన్ని నొక్కేయడానికి రాజ్యాంగంలోని పార్టీ ఫిరాయింపుల నిబంధనలను ప్రయోగించరాదని పేర్కొన్నారు. ఎదుటి పక్షంలోని ఎమ్మెల్యేలను శాసన సభ్యత్వాలకు అనర్హులుగా ప్రకటించాలని ఇరు వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లను తోసిపుచ్చారు. ఎన్నికల కమిషన్ కూడా, అజిత్ వర్గమే అసలైన ఎన్సీపీ అని గత వారం ప్రకటించింది. శరద్ పవార్ కుమార్తె, ఎంపీ సుప్రియ సూలే స్పందిస్తూ, మహారాష్ట్రలోని రెండు ముఖ్యమైన పార్టీలను అంతం చేయడానికి ఓ అదృశ్య శక్తి ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు.

అమెరికాలో మరో భారతీయుడి హత్య

వాషింగ్టన్, ఫిబ్రవరి 15: భారత సంతతికి చెందిన మరో వ్యక్తి అమెరికాలో హత్యకు గురయ్యాడు. ప్రవీణ్ రావ్జీభాయ్ పటేల్(76) అనే హోటల్ యజమానిని ఓ వినియోదారుడు కాల్చి చంపిన ఘటన అమెరికాలోని అలబామాలో జరిగింది. షెఫ్ఫీల్డ్ పోలీస్ చీఫ్ రికీ టెర్రీ కథనం ప్రకారం షెఫీల్డ్లో రోడ్డు పక్కన ప్రవీణ్ హిల్క్రెస్ట్ హోటల్ నిర్వహించేవారు. గతవారం విలియం జెరెమీ మూర్(34) అనే కస్టమర్ అద్దె గది కోసం అతడి హోటల్కు వచ్చాడు. అద్దె విషయంలో వాగ్వాదం తలెత్తడంతో కోపోద్రిక్తుడైన మూర్ వెనక్కు వెళ్లి తన తుపాకీ తెచ్చి పటేల్ను కాల్చి చంపాడు. అనంతరం ఒక ఖాళీ ఇంట్లో దాక్కోవడానికి ప్రయత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పటేల్ హత్యను ఆసియా అమెరికన్ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ ఖండించింది. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఇటీవల అమెరికాలో భారతీయులు, భారత సంతతి వ్యక్తులపై దాడులు జరగడం ఎన్నారైల్లో ఆందోళన రేకెత్తిస్తున్నది.

బ్రిటన్కు భారత విద్యార్థుల బైబై!

4 శాతం తగ్గిన దరఖాస్తులు

లండన్, ఫిబ్రవరి 15: ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లటానికి భారతీయులు ప్రస్తుతం ఆసక్తి కనబర్చటం లేదు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల అడ్మిషన్స్ సర్వీస్ (యూసీఏఎస్) తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది. బ్రిటన్కు ఉన్నత చదువుల కోసం వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య 0.7 శాతం పెరిగినా.. కేవలం ఇండియా, నైజీరియా నుంచి వెళ్లే విద్యార్థుల సంఖ్య మాత్రం తగ్గుముఖం పట్టిందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే భారత్ నుంచి వచ్చే దరఖాస్తుల్లో 4 శాతం తగ్గుముఖం కనిపించింది. నైజీరియా నుంచి వచ్చే దరఖాస్తుల్లో 46 శాతం తగ్గుదల నమోదైంది. పోస్ట్ స్టడీ వర్క్ వీసాపై ఆంక్షలు, విద్యార్థులు తమ వెంట కుటుంబసభ్యులను తీసుకురావడంపై ప్రభుత్వం నియంత్రణ విధించడమే ఇందుకు కారణంగా తెలుస్తున్నది.

'బైక్ ట్యాక్సీలు కాంట్రాక్ట్ క్యారేజ్ పరిధిలోకే'

న్యూఢిల్లీ: బైక్ ట్యాక్సీల చట్టబద్ధతపై కేంద్రం స్పష్టత ఇచ్చింది. మోటారు వాహనాల చట్టం 1988 ప్రకారం మోటారుసైకిళ్లు 'కాంట్రాక్టు క్యారేజ్' నిబంధనల పరిధిలోకే వస్తాయని కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ పేర్కొంది. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఒక నిర్దిష్టమైన ఒప్పందంతో ఒక వాహనం ప్రయాణికులను తీసుకువెళితే దానిని కాంట్రాక్టు క్యారేజ్ అంటారని, బైక్ టాక్సీలు కూడా ఒక ఒప్పందం ప్రకారమే ప్రజలను తమ గమ్య స్థానాలకు చేరుస్తున్నందున అవి కూడా 'కాంట్రాక్టు క్యారేజ్' పరిధిలోకే వస్తాయని తెలిపింది. మోటారు వాహనాల చట్టం ప్రకారం ఇక నుంచి మోటారు సైకిళ్లను కాంట్రాక్టు క్యారేజ్ వాహనాల క్యాటగిరి కింద పరిగణనలోకి తీసుకుంటారు.

చంద్రుడిపైకి మరో ల్యాండర్

ప్రయోగించిన అమెరికా కంపెనీ

న్యూయార్క్, ఫిబ్రవరి 15: అంతరిక్ష ప్రయోగాల్లో ప్రైవేట్ కంపెనీలను ప్రోత్సహిస్తున్న నాసా, తాజాగా చంద్రుడిపైకి మరో ల్యాండర్ 'ద ఒడిస్సే'ను పంపింది. హ్యూస్టన్కు చెందిన ప్రైవేట్ కంపెనీ 'ఇంటూటైవ్ మెషీన్స్' బుధవారం రాత్రి నాసాకు చెందిన కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ఎక్స్ ఫాల్కన్ రాకెట్ను అంతరిక్షంలోకి ప్రయోగించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనల నిమిత్తం నాసా ఈ ప్రయోగాన్ని చేపట్టింది. అంతా అనుకున్నట్టు జరిగితే.. ఫిబ్రవరి 22న లూనార్ ల్యాండర్ 'ద ఒడిస్సే' చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుమోపుతుంది.

నేడు గ్రామీణ భారత్ బంద్

- ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు
- దేశవ్యాప్తంగా ప్రధాన రహదారులు దిగ్బంధం
- గ్రామీణ మార్కెట్లు, వ్యవసాయ పనులు బంద్
- సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల వెల్లడి

రైల్ రోకో సందర్భంగా పంజాబ్లోని రాజ్పురలో ట్రాక్పై నిరసన తెలుపుతున్న రైతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 15: కేంద్రంలోని మోదీ సర్కార్ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ నేడు దేశవ్యాప్తంగా 'గ్రామీణ భారత్ బంద్' నిర్వహించనున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం), కేంద్ర కార్మిక సంఘాలు వెల్లడించాయి. తమ సమస్యలను ప్రజలకు వివరించి, కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే బంద్కు పిలుపునిచ్చినట్టు తెలిపాయి. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ బంద్ కొనసాగనున్నది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దేశవ్యాప్తంగా ప్రధాన రహదారులపై రైతులు, కార్మికులు 'చక్కా జామ్'ను చేపడతారు. వ్యవసాయ, ఉపాధి హామీ పనులు ఉండవని, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికులెవ్వరూ పనిచేయరని భారతీయ కిసాన్ యూనియన్ నాయకుడు రాకేశ్ టికాయిత్ చెప్పారు. కూరగాయల అమ్మకం సహా గ్రామాల్లో సమస్తం బంద్ అవుతుందని తెలిపారు. అంబులెన్సులు, వివాహాలు, అంత్యక్రియలు, మెడికల్ దుకాణాలు, వార్తా పత్రికల సరఫరా, బోర్డు పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు, అత్యవసర సేవలకు బంద్ నుంచి మినహాయింపు ఇచ్చామని ఎస్కేఎం జాతీయ సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ దర్శన్పాల్ తెలిపారు.

రైతుల డిమాండ్లు ఇవీ..

స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర, రైతు రుణాల మాఫీ, సమగ్ర పంటల బీమా, వ్యవసాయం, గృహ వసరాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ, కార్మిక చట్టాల సవరణల ఉపసంహరణ.. తదితర డిమాండ్లను రైతులు కేంద్రం ముందుంచారు.

మూడో రోజుకు చలో ఢిల్లీ

రైతులు చేపట్టిన 'చలో ఢిల్లీ' కార్యక్రమం గురువారం మూడో రోజుకు చేరుకుంది. పంజాబ్లో రైతులు రైల్ రోకో నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముందు ముందు దేశవ్యాప్తంగా చేపడతామని కేంద్రాన్ని హెచ్చరించారు. పంజాబ్, హర్యానా సరిహద్దుకు రైతులు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. ఢిల్లీ చేరేందుకు ప్రయత్నిస్తున్నారు. రైతుల్ని అడ్డుకునేందుకు పోలీసులు 30 వెల టియర్ గ్యాస్ షెల్స్ను ఆర్డర్ పెట్టాయి. శింభు సరిహద్దు వద్ద, హర్యానాలోని 7 జిల్లాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలపై, బల్క్ ఎస్ఎంఎస్ పోస్టులపై నిషేధాన్ని శనివారం వరకు ప్రభుత్వం పొడగించింది. శుక్రవారం పంజాబ్లోని కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవల్ని నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదిలా ఉండగా, గురువారం చండీగఢ్లో రైతులకు, కేంద్ర మంత్రులకు మధ్య మూడో రౌండ్ చర్చలు జరిగాయి. 17 రైతు సంఘాల ప్రతినిధులతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, వ్యవసాయ మంత్రి అర్జున్ ముండా, కేంద్ర సహాయమంత్రి నిత్యానంద రాయ్ చర్చలు జరిపారు.

నిమిషానికి మస్క్ సంపాదన రూ.5.71 లక్షలు!

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుల్లో ఒకరైన టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఓ నిమిషంలో అక్షరాలా రూ.5,71,668.18 సంపాదిస్తున్నారు. ఫోర్బ్స్ పత్రిక విడుదల చేసిన వరల్డ్స్ రియల్ టైమ్ బిలియనీర్స్ ఇండెక్స్ ఈ వివరాలను వెల్లడించింది. 2023లో మస్క్ సంపాదన రూ.3,00,55,42,28,745.00 (3.6203 బిలియన్ డాలర్లు). ఆ ఏడాది నిమిషానికి ఆయన రూ.5,71,668 సంపాదించారు. గత ఏడాది కన్నా ఆయన నికర సంపద విలువ తగ్గిపోయినప్పటికీ ప్రపంచంలోని సంపన్నుల్లో ఒకరిగా కొనసాగుతున్నారని నివేదిక తెలిపింది.

మూత్రంతో విద్యుత్తు, ఎరువు!

పాలక్కాడ్ : ఐఐటీ పాలక్కాడ్కి చెందిన పరిశోధకులు అద్భుత ఆవిష్కరణ చేశారు. మానవ మూత్రంతో పునరుత్పాదక శక్తితో పాటు బయోఫెర్టిలైజర్ను ఉత్పత్తి చేసే విధానాన్ని కనిపెట్టారు. మానవ మూత్రాన్ని ఎలక్ట్రోకెమికల్ రిసోర్స్ రికవరీ రియాక్టర్లోకి ప్రవేశపెట్టి, ఎలక్ట్రోకెమికల్ రియాక్షన్స్కు గురి చేయడం వల్ల విద్యుత్తుతోపాటు బయోఫెర్టిలైజర్స్ను ఉత్పత్తి చేయొచ్చని వారు తెలిపారు. సెపరేషన్ అండ్ ప్యూరిఫికేషన్ టెక్నాలజీ అనే ఆన్లైన్ జర్నల్లో పరిశోధక బృందం తమ ప్రయోగ విశేషాలను ప్రచురించింది. తమ నూతన ఆవిష్కరణపై పేటెంట్ పొందేందుకు వారు దరఖాస్తు చేసుకున్నారు.

వచ్చేస్తున్నది క్యాన్సర్ టీకా!

తయారీ తుది దశలో ఉందని పుతిన్ ప్రకటన

మాస్కో: ప్రపంచవ్యాప్తంగా చిన్నాపెద్దా అందరినీ కబళిస్తున్న క్యాన్సర్కు అడ్డకట్ట వేసే టీకా వచ్చేస్తున్నది. ఈ విషయంలో రష్యా శాస్త్రవేత్తలు దాదాపు విజయం సాధించారు. ఈ మేరకు బుధవారం ఆ దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక ప్రకటన చేశారు. క్యాన్సర్ టీకా తయారీలో తమ శాస్త్రవేత్తలు దాదాపు తుది దశలో ఉన్నట్టు వెల్లడించారు. క్యాన్సర్ టీకాతో పాటు దాని చికిత్సలో ఉపయోగించే ఇమ్యునోమాడ్యులేటరీ డ్రగ్స్ తయారీలో శాస్త్రవేత్తలు తలమునకలై ఉన్నట్టు పేర్కొన్నారు. త్వరలోనే అవి వ్యక్తిగత చికిత్సా పద్ధతులుగా సమర్థంగా ఉపయోగపడతాయని ఆశిస్తున్నట్టు చెప్పారు. అయితే, ఈ వ్యాక్సిన్ ఏ క్యాన్సర్ను లక్ష్యంగా చేసుకుని అభివృద్ధి చేస్తున్నదీ బయటపెట్టలేదు. మరోవైపు, ట్రంప్ కంటే బైడెన్ బెటర్ అని పుతిన్ వ్యాఖ్యానించారు. బైడెన్ అనుభవం గల, అంచనా వేయగల నేత అని పేర్కొన్నారు.

పిల్లల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయ్

సోషల్మీడియా సంస్థలపై న్యూయార్క్ నగరం దావా

న్యూయార్క్, ఫిబ్రవరి 15: టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై సోషల్ మీడియా దుష్ప్రభావం చూపుతున్నదని ఆందోళన చెందుతున్న అమెరికాలోని నగరాలు, రాష్ట్రాలు, పాఠశాలల జాబితాలో న్యూయార్క్ నగరం కూడా చేరింది. సామాజిక మాధ్యమాల వల్ల యువత, పిల్లల్లో మానసిక ఆరోగ్య సంక్షోభం తలెత్తుతున్నదని బుధవారం ఆ నగరం కాలిఫోర్నియా రాష్ట్ర కోర్టులో దావా వేసింది. మెటా, బైట్డాన్స్, గూగుల్, స్నాప్చాట్లను ప్రతివాదులుగా పేర్కొంది. ఏటా యువత మానసిక ఆరోగ్య కార్యక్రమాలు, సేవలపై 100 మిలియన్ డాలర్లకు పైగా ఖర్చు పెడుతున్నట్టు న్యూయార్క్ నగర కార్పొరేషన్ కోర్టుకు తెలిపింది. న్యూయార్క్ సిటీ ఆరోపణలపై మెటా, స్నాప్ చాట్ వంటి సంస్థలు స్పందించాయి. తాము వయసుల వారీగా ప్రజలకు అవసరమైన సురక్షిత కంటెంట్ను అందిస్తున్నామని తెలిపాయి.

ఇన్స్టా రీల్స్కు బానిసైన భార్య.. భర్త ఆత్మహత్య

బెంగళూరు: సామాజిక మాధ్యమాల పట్ల అతిగా ఆకర్షితులవుతుండటం తీవ్ర సమస్యలకు దారి తీస్తున్నది. కర్ణాటకలోని చామరాజనగరలో ఓ వ్యక్తి మరణానికి ఇది కారణమైంది. పోలీసుల కథనం ప్రకారం, కుమార్ (34) కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. ఆయన భార్య నిరంతరం ఇన్స్టాగ్రామ్ రీల్స్ చేస్తూ, అప్లోడ్ చేస్తుండేవారు. ఇన్స్టాగ్రామ్ను అతిగా చూడటంపై భర్త అభ్యంతరం చెప్పినా ఆమె వినలేదు. దీంతో ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. చివరికి గురువారం కుమార్ ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆర్థిక మాంద్యంలోకి బ్రిటన్

ఎన్నికల వేళ రిషి సునాక్కు షాక్



లండన్, ఫిబ్రవరి 15: ఎన్నికల వేళ బ్రిటన్ ప్రధాని రిషి సునాక్కు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. యూకే క్రమంగా ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొనబోతున్నది. 2023 చివరి త్రైమాసికం ఆర్థిక మాంద్యంలోకి వెళ్లింది. ఈ మూడు నెలల్లో యూకే జీడీపీ 0.3 శాతం తగ్గినట్టు బ్రిటన్ జాతీయ గణాంక శాఖ తెలిపింది. ఈ పరిస్థితికి పారిశ్రామిక ఉత్పత్తి, నిర్మాణ రంగం, సేవల్లో స్తబ్ధత ఏర్పడటమే కారణమని విశ్లేషిస్తున్నారు. ఆర్థిక వేత్తలు అంచనా వేసినట్టుగా జీడీపీ క్షీణత 01 శాతం కన్నా ఎక్కువగా నమోదు కావటం గమనార్హం. వరుసగా రెండు త్రైమాసికాల్లో జీడీపీ నెమ్మదిస్తే దాన్ని మాంద్యంగా పేర్కొంటారు. బ్రిటన్ జీడీపి అంతకు ముందు త్రైమాసికంలో కూడా 0.1 శాతం తగ్గింది. చివరి త్రైమాసికంలో కూడా తగ్గుదల నమోదైంది. 2020లో ఒకసారి ఇలాగే బ్రిటన్ ఆర్థిక మాంద్యంలోకి వెళ్లింది. ఇప్పుడు అదే పునరావృతం అయ్యింది. బ్రిటన్ అధికార పార్టీ అయిన కన్సర్వేటివ్ పార్టీపై ఆర్థిక మాంద్యం పెద్ద ప్రభావాన్నే చూపనున్నది. ఈ సంవత్సరం లోనే ఎన్నికలు జరగాల్సి ఉన్నది. ఎన్నికల తేదీ ఇంకా నిర్ణయించలేదు. దేశ ఆర్థిక వ్యవస్థను పట్టాలెక్కిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన రుషి సునాక్కు ఇది నిజంగా ఇబ్బంది కలిగించే అంశమే.

దిగజారిన జపాన్ ఆర్థిక వ్యవస్థ

నాలుగో స్థానానికి పతనం



టోక్యో: ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో అమెరికా, చైనా తర్వాతి స్థానం జపాన్దే. అయితే తాజాగా జపాన్ నాలుగో స్థానానికి పడిపోయింది. గత ఏడాది ఆ దేశ జీడీపీ జర్మనీ కంటే తక్కువగా నమోదైంది. గతేడాది జపాన్ నామమాత్రపు జీడీపీ 4.2 ట్రిలియన్ డాలర్లు కాగా.. అదే సమయంలో మూడో స్థానంలో ఉన్న జర్మనీ 4.4 ట్రిలియన్ డాలర్లుగా ఎదిగింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు జపాన్ వాస్తవిక జీడీపీ వృద్ధిని చూస్తే సంవత్సరానికి 0.4 శాతం తగ్గుదల కనిపించింది. మూడు నెలల వారీగా చూస్తే 0.1 శాతం క్షీణించింది. తాజా ధరలతో నామమాత్రపు జీడీపీని లెక్కిస్తుండగా.. స్థిర ధరల ఆధారంగా వాస్తవిక జీడీపీని లెక్కిస్తారు. జపాన్లో ఎందుకింత క్షీణత కనిపిస్తుందన్న దాన్ని విశ్లేషిస్తే.. దేశంలో వృద్ధుల సంఖ్య పెరిగిపోవటం, పిల్లల సంఖ్య బాగా తగ్గిపోవటం వల్ల ఉత్పాదకతలో తగ్గుదల ఏర్పడింది. పోటీతత్వాన్ని కూడా జపాన్ క్రమేపీ కోల్పోసాగిందని అర్థమవుతున్నది. తాజాగా వెలువడిన గణాంకాలు కూడా ఈ విషయాన్నే ప్రతిబింబిస్తున్నాయి. అణు దాడుల్లో సర్వనాశనమైన దశ నుంచి కసిగా ఎదిగిన జపాన్.. సుమారు రెండు దశాబ్దాల పాటు ఆర్థిక వ్యవస్థలో నంబర్ 2 స్థానాన్ని నిలబెట్టుకున్నది. 2010లో చైనా విజృంభించి జపాన్ను మూడో స్థానానికి నెట్టేసింది.

ప్రాణం తీసిన సర్జికల్ రోబో!

రోగి అవయవాలకు రంధ్రాలు • రూ.62 లక్షల పరిహారం చెల్లించాలని భర్త దావా



మియామీ, ఫిబ్రవరి 15 : అన్ని రంగాల్లో మానవుల స్థానాన్ని రోబోలు భర్తీ చేయగలవని ప్రపంచం విశ్వసిస్తున్నది. అయితే ఇది పూర్తి నిజం కాదన్న సంగతి మరోసారి బయటపడింది. అమెరికాలో వైద్యులు ఓ సర్జికల్ రోబో సాయంతో నిర్వహించిన పెద్ద ప్రేగు క్యాన్సర్ ఆపరేషన్ వికటించింది. శస్త్ర చికిత్సలో వాడిన సర్జికల్ రోబో తన భార్య చిన్న ప్రేగుకు రంధ్రాలు చేసిందని, ఇది ఆమె మరణానికి దారితీసిందని ఓ వ్యక్తి అక్కడి కోర్టులో దావా వేశారు. సర్జికల్ రోబోను విక్రయిస్తున్న 'ఇంట్యూటివ్ సర్జికల్' సంస్థ 75 వేల డాలర్లు (సుమారుగా రూ.62.26 లక్షలు) నష్టపరిహారంగా చెల్లించాలని కోర్టును కోరారు. 'న్యూయార్క్ పోస్ట్' కథనం ప్రకారం, సాండ్రా సుల్జర్ భర్త హార్వే సుల్జర్ ఫిబ్రవరి 6న 'ఇంట్యూటివ్ సర్జికల్' అనే కంపెనీపై కోర్టులో కేసు వేశాడు. 2021 సెప్టెంబర్లో ఫ్లోరిడాలోని బాప్టిస్ట్ హెల్త్ బోకా రాటన్ రీజినల్ దవాఖానలో సాండ్రా సుల్జర్ పెద్ద ప్రేగుకు వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. రిమోట్తో పనిచేసే 'డా విన్సీ' అనే సర్జికల్ రోబోను వైద్యులు ఆపరేషన్లో వినియోగించారు. రోబో వల్ల ఆమె చిన్న ప్రేగుకు రంధ్రాలు అయ్యాయి. ఆపరేషన్ తదనంతరం ఆమె తీవ్ర అనారోగ్యానికి గురై.. 2022 ఫిబ్రవరిలో కన్నుమూశారు. ఆపరేషన్ సమయంలో అంతర్గత అవయవాలను రోబో దెబ్బతీస్తున్న సంగతి కంపెనీకి ముందే తెలుసునని, ఈ సంగతి కుటుంబ సభ్యులకు తెలియజేయలేదని మృతురాలి భర్త ఆరోపించారు. రోబోతో ఏర్పడిన గాయాలు, లోపాల గురించి కంపెనీకి వేలాది నివేదికలు అందాయని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అయినప్పటికీ కంపెనీ యాజమాన్యం ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ను తప్పుదారి పట్టించిందని దావాలో పేర్కొన్నారు. డా విన్సీ రోబో వాడకంపై వైద్యులకు తగిన శిక్షణ ఇవ్వడంలో సంస్థ విఫలమైందని, అనుభవం లేని దవాఖానలకు రోబోలను విక్రయించిందని ఆయన ఆరోపించారు.